క్లుప్తంగా

అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్న అధికారులు



తాడికొండ: తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కొండను తవ్వి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మట్టిని తవ్వుతున్న పొక్లెయిన్‌ను స్వాధీనం తీసుకొని, కేసు నమోదు చేసిన అనంతరం పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్, మట్టి తరలింపు నేరమని, ఇలాంటివి గ్రామాల్లో ఎక్కడైనా జరిగితే తమకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పానుగుపాడులో మండల స్థాయి పోటీలు

ఫిరంగిపురం: ఆటతీరు మార్చుకునేందుకు పోటీలు ఎంతో దోహదపడతాయని పాఠశాల హెచ్‌ఎం కె.సాంబశివరావు అన్నారు. మండలంలోని పానుగుపాడు జిల్లాపరిషత్ పాఠశాలలో బుధవారం మండలస్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను హెచ్‌ఎం సాంబశివరావు ప్రారంభించి మాట్లాడారు. ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్)లో భాగంగా అండర్-14, అండర్-17 మండలస్థాయి ఆటలపోటీలు పాఠశాలలో ప్రారంభించినట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈపోటీలకు మండలంలోని నుదురుపాడు, బేతపూడి, మునగపాడు, అల్లంవారిపాలెం, అమీనాబాద్ హైస్కూల్, సెయింట్‌పాల్స్ హైస్కూల్, సెయింట్‌ఆన్స్ పాఠశాలలకు చెందిన 220 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఈపోటీలలో గెలుపొందినవారిని కొద్దిరోజుల్లో తాడికొండలో నిర్వహించే నియోజకవర్గస్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో పలు పాఠశాలల పీఈటీలు, పీడీ బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

రేపల్లె రూరల్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఈఈ కేవీ ఎల్ఎన్ మూర్తి హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించి, అనంతరం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. విద్యుత్ అధికారులు 59 బృందాలుగా మండలంలోని అన్ని గ్రామాల్లో 4,338 గృహ, 130 వాణిజ్య, 65 ఆక్వా సర్వీసుల్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. 159 సర్వీసుల వారు అదనపులోడును వినియోగిస్తున్నట్లుగా గుర్తించి సంబంధిత యజమానులకు రూ.6,42,260 జరిమానా విధించామని తెలిపారు. అనుమతించిన కేటగిరికి విరుద్ధంగా లోడు వాడుతున్న వారు ఆరుగురిని గుర్తించి రూ.16,000 జరిమానా, అక్రమ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ముగ్గురిని గుర్తించి రూ.45,000 జరిమానా విధించామని చెప్పారు. కార్యక్రమంలో తెనాలి డివిజన్ ఈఈ వి.వి. చిరంజీవి, డీఈలు అశోక్, రాజశేఖర్, వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, ఎస్.భాస్కరరావు, తెనాలి డివిజన్‌లోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

చందాలకు విద్యార్థుల్ని వినియోగిస్తే చర్యలు

రేపల్లె రూరల్: వినాయక చవితి పండుగ పురస్కరించుకుని ఆయా కమిటీల సభ్యులు విద్యార్థులు, చిన్నారులతో చందాల్ని వసూలు చేయిస్తే చర్యలు తప్పవని ఎంఈవో కేసనపల్లి సురేష్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. పట్టణంలో పలుచోట్ల పలువురు చిన్నారులు, విద్యార్థులు చందాలకు వెళుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరైతే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలని తెలిపారు. గైర్హాజరుకు సంబంధించిన వివరణను సేకరించాలని చెప్పారు. పట్టణ ప్రజలు కూడా చిన్నారులు, విద్యార్థుల్ని ఎవరైనా చందాలకు వస్తే సంబంధిత పోలీసులకు గానీ, మండల విద్యావనరుల కేంద్రంలో గానీ సమాచారం అందించాలని ఆయన కోరారు.

రైతులకు డిజిటల్ విధానంపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: రైతులకు ఎదురయ్యే సమస్యలకు డిజిటల్ విధానంలో సమాచారం అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయటం ఈ కార్యక్రమం ఉద్దేశమని ఆత్మ పీడీ రామాంజనేయులు తెలిపారు. బుధవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో డిజిటల్ గ్రీన్ సంస్థ, భారత వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అమలవుతున్న విస్తార్ ప్రాజెక్ట్‌లో భాగంగా డేటా డెస్టినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విస్తరణ కార్యకర్తలు, వారి అనుభవాలను తెలుసుకునేందుకు హార్టికల్చర్, అగ్రికల్చర్, ప్రకృతి వ్యవసాయం, సెర్ప్, వ్యవసాయ శాఖల్లో పనిచేసే క్షేత్రస్థాయి కార్యకర్తలు, అధికారులతో సమావేశం నిర్వహించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ఎటువంటి సమాచారం కోరుతున్నారు, ఏఏ సేవలు అవసరం, ఏఏ వేదికలపై రైతులు ఎక్కువగా చర్చిస్తున్నారు,

ఇంటింటా నూతన కాంతులు

- అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందలేదని చెప్పే పరిస్థితి రాష్ట్రంలో లేదు
- వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్లు అందజేత



పొన్నెకల్లులో నూతనంగా మంజూరైన పింఛన్లు అందజేస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: పేదవాడికి సంక్షేమం నేరుగా అందించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ స్థానంలో ఉందని, లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు నేరుగా ఖాతాలకే వెళుతుండగా, పింఛన్ ఇంటివద్దకే అందుతుండటమే ఇందుకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. బుధవారం తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పెన్షన్లు అందించే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకం అందుతుందని, అర్హత ఉండి తనకు పింఛన్, సంక్షేమ పథకం అందలేదని చెప్పే పరిస్థితి ఎక్కడైనా ఉంటే ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయవచ్చని ఆయన సవాల్ విసిరారు. 14 సంవత్సరాల పాలనలో దోచుకొన్నవి, దాచుకోవడం కోసమే పనిచేసిన చంద్రబాబు పాపం పండి నేడు అవినీతి కేసుల్లో జైలు పాలయ్యాడన్నారు. 27 కేసుల్లో స్టేలు తెచ్చుకొని బయట తిరుగుతున్న ఆర్థిక ఉగ్రవాది, అవినీతిపరుడు చంద్రబాబును సమర్థిస్తూ టీడీపీ నాయకులు గ్రామాల్లో నిరసనలు చేయడం సిగ్గుచేటన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో తమకు అనుకూలమైన వారికే పెద్దపీట వేసిన చంద్రబాబు సామాన్యుడికి తీరని అన్యాయం చేసినందునే నేడు ప్రజలు ఓటు హక్కుతో తగిన బుద్ధి చెప్పారన్నారు. జైలులో ఉన్న బాబుకు బెయిల్ సంగతి సరే కానీ అవినీతి కేసులన్నిటినీ ఒకేసారి విచారించిన తరువాతే బయటకు పంపితే మేలని, లేకుంటే సాక్షులను బెదిరించి సాక్ష్యాధారాలు తారుమారు చేసే ప్రమాదం ఉందన్నారు. బాబు దెబ్బకు రాష్ట్రంలో అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, బాబుతో కలిసి స్కాములు చేసిన వారందరూ మూకుమ్మడిగా త్వరలో అరెస్టు చేయడం ఖాయమన్నారు. అనంతరం సర్పంచ్ నూకతోటి మేరిమ్మతో కలిసి నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ పత్రాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడికొండూరులో...

మేడికొండూరు: పింఛన్ల పంపిణీలో దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలుస్తోందని మేడికొండూరు జడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య అన్నారు. మండల పరిధిలోని డోకిపర్రు గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయన బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పింఛన్లను పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందంజలో ఉందని ఆయన పేర్కొన్నారు. గ్రామంలోని 41 మంది నూతన పింఛన్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. గ్రామసర్పంచి కోండెపోగు సామ్రాజ్యం, ఎంపీటీసీ నోసిన రామకోటమ్మ, నోసిన కోటేశ్వరరావు, కోండెపోగు కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్, దివ్య తదితరులు పాల్గొన్నారు.



మునగపాడులో నూతన పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ షేక్ షహేలానర్గీస్



నూతన పింఛన్లు అందజేస్తున్న ఖాదీగ్రామీణాభివృద్ధి బోర్డు డైరెక్టర్ చిట్టా అంజిరెడ్డి

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్‌లను ప్రభుత్వం అందజేస్తున్నట్లు ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ అన్నారు. మండలంలోని మునగపాడు గ్రామంలోని సచివాలయం వద్ద బుధవారం నూతనంగా 11మందికి మంజూరైన వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లను షహేలా నర్గీస్ అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్.గోవిందు, షేక్ సలీం, పంచాయతీ కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు, శివ కోటేశ్వరరావు, గాయత్రి పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని రేపూడిగ్రామ సచివాలయం వద్ద నూతనంగా మంజూరైన 13 మందికి పింఛన్లను కేంద్ర ఖాదీ గ్రామీణాభివృద్ధి బోర్డు డైరెక్టర్ చిట్టా అంజిరెడ్డి, గ్రామసర్పంచ్ అంజనీదేవిలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదలై అర్హులైన వారికి నూతనంగా పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గజేంద్రనాథ్, చిట్టా శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

చుక్కపల్లివారి పాలెంలో ప్రాథమిక పాఠశాల

ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చుక్కపల్లివారిపాలెంలో ప్రభుత్వం నూతనంగా ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేస్తూ బుధవారం విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దుగ్గిరాల మండలం చుక్కపల్లివారి పాలెంలో గతంలో సాల్వేషన్ ఆర్మీ ఎయిడెడ్ పాఠశాల ఉండేది. 2021లో ఆ పాఠశాల రద్దు కావడంతో చుక్కపల్లివారి పాలెం విద్యార్థులు చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి విద్యను అభ్యసిస్తున్నారు. ఎమ్మెల్యే ఆర్కే నాలుగు నెలల క్రితం ఈ గ్రామంలో పర్యటించిన సమయంలో సర్పంచ్ దాసరి సుందరమ్మ తమ గ్రామంలో పాఠశాల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, పక్క ఊళ్లకు పంపించలేక పిల్లలను చదువు మాన్పించి పనులకు పంపిస్తున్నారని తెలియజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే జిల్లా విద్యాశాఖ అధికారులతో చర్చించారు. విద్యాశాఖ అధికారులు చుక్కపల్లివారి పాలెంలో పరిస్థితులను పరిశీలించి, 2023–24 సంవత్సరంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు నూతన పాఠశాల (ఫౌండేషన్ ప్లస్) ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలను తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే ఆర్కే చేసిన కృషిపై చుక్కపల్లివారి పాలెంలో ప్రజలతో పాటు, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ, తదితరులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

భట్టిప్రోలు: సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి ధూళిపాళ్ల రమాదేవి సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భట్టిప్రోలు కేఎస్‌కే మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకుని లక్ష్యాల్ని చేరుకునే క్రమంలో అనేక ఆటంకాలు ఎదురవుతాయని తెలిపారు. వాటిని అధిగమించి చదువులో ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి. మనోజ్ కుమార్, మండల నాయకురాలు హైమ, కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

చర్మకారుల భవన నిర్మాణానికి వీడిన చిక్కులు

ప్రారంభమైన పనులు



ప్రారంభమైన చర్మకార భవన నిర్మాణ పనులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి చర్మకారుల కోసం నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలంటూ ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో కొంత కాలం క్రితం ఆ పనులు నిలిచిపోయాయి. రెవెన్యూ అధికారులు సరైన ఆధారాలను కోర్టుకు అందజేయడంతో తిరిగి బుధవారం నుంచి ఆ పనులు ప్రారంభించారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి ఐటీసీ వద్ద కార్పొరేషన్ స్థలంలో చర్మకారుల కోసం మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి, పలువురు ప్రముఖులు 2022 ఆగస్టు 8న శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణానికి కార్పొరేషన్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.57 లక్షలు కేటాయించి చర్మకారుల కోసం 10 షాపుల నిర్మాణం చేపట్టారు. పునాదుల వరకు పనులు పూర్తి అయ్యాయి. అయితే ఇజ్రాయిల్ అనే వ్యక్తి ఆ స్థలం తనదంటూ ఎప్పటి నుంచో పంటపండించుకుంటున్నానని కోర్టును ఆశ్రయించాడు. వెంటనే కోర్టు రెవెన్యూ అధికారులను రూల్స్ ప్రకారం స్పీకింగ్ ఆర్డర్స్ ఇచ్చి, అది ప్రభుత్వ స్థలమని ఆధారాలు చూపించి నిర్మాణం చేపట్టాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సరైన ఆధారాలు చూపించారు. దాంతో కోర్టులో నిర్మాణానికి అడ్డంకులు తొలగడంతో కార్పొరేషన్ అధికారులు చర్మకార భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ త్వరలోనే భవన నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు కార్పొరేషన్ నుంచి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటింటికీ ధర్మ ప్రచారం ప్రారంభం

రేపల్లె: హైందవ సంస్కృతిని పరిరక్షించేందుకు సమరసత సేవా ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందని రేపల్లె సబ్ డివిజన్ కన్వీనర్ క్రాప రవికుమార్ తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని పట్టణంలోని 1వ వార్డు శ్రీరామ్‌నగర్‌లోని రామాలయం వద్ద బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలో విశిష్టమైన హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేసి, భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల్ని పరిరక్షించేందుకు కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు ప్రచారం చేయనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, సహ కన్వీనర్ శొంఠి బాబూరావు, మహిళా కన్వీనర్ గొరిపర్తి రాధ, సభ్యులు వక్కలగడ్డ వెంకట్రామయ్య, నంబూరి రమాదేవి పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై సమాచారం ఇవ్వండి

గుంటూరు రూరల్: గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా వెంటనే అధికారులకు సమాచారం అందించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని గుంటూరు రూరల్ మండలం ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు. బుధవారం మండలంలోని లాలుపురం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం, సచివాలయాన్ని పరిశీలించారు. అక్కడ సిబ్బందితో మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, సమయపాలన పాటించి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజు యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలన్నారు. దుస్తులు ధరించని వారిపై శాఖపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్య ఏది ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి వివరించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ గురించి పీఆర్‌పీఆర్‌డీ ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో బంగారు పతకం



యోగా శిక్షకురాలు కె.పూజితను, విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో యోగా శిక్షకురాలికి బంగారు పతకం లభించినట్లు కేఎల్‌యూ క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ స్టేట్ యోగాసనా స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో కేఎల్‌యూలో యోగా శిక్షకురాలిగా పనిచేస్తున్న కె.పూజితకు బంగారు పతకం వచ్చిందని అన్నారు. కర్నూలులో ఈనెల 9 నుంచి 11 వరకు జరిగిన ఈ చాంపియన్ షిప్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి యోగా గురువులు, విద్యార్థులు పాల్గొన్నారన్నారు. యోగా శిక్షకురాలితో పాటు పాల్గొన్న కేఎల్‌యూలో మెకానిక్ విభాగంలో 4వ సంవత్సరం చదువుతున్న కె.అజయ్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో 4వ సంవత్సరం చదువుతున్న వి.చంద్రశేఖర్‌లు రెండు పతకాలు సాధించారని వివరించారు. కేఎల్‌యూ ప్రో.చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో.వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, యోగా గురువు వై.హరి పోతులూరు తదితరులు బంగారు పతకం సాధించిన యోగా శిక్షకురాలు కె.పూజితను, విద్యార్థులను అభినందించారు.

ఓటర్లను తనిఖీ చేయాలి

పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గంలో ఒకే డోర్ నంబర్లో పది మందికి మించి ఉన్న ఓటర్లను తనిఖీ చేయాలని పొన్నూరు అసెంబ్లీ ఈఆర్‌ఓ హరిహర నాథ్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 సంవత్సరాల వయస్సు దాటిన ఓటర్ల వివరాలు, క్లైముల సత్వర పరిష్కారం తదితర విషయాలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు తహసీల్దార్లు పి. రత్నం, గోపాలకృష్ణ, ఎస్. శ్రీకాంత్, పొన్నూరు ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు, టీపీఓ సాంబయ్య, డిప్యూటీ తహసీల్దార్లు ఫణి కుమార్, ప్రణతి, సీనియర్ అసిస్టెంట్లు ఆనందరావు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలి

చేబ్రోలు: మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంను అందించాలని చేబ్రోలు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల, సుద్దపల్లి దళితవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకంను బుధవారం తహసీల్దారు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన..

మండల పరిధిలోని పాతరెడ్డిపాలెం, శేకూరు, శలపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. పాతరెడ్డిపాలెం గ్రామ పరిధిలోని పోలింగ్ కేంద్రం శిథిలావస్థకు చేరినట్లు గుర్తించారు. విద్యుత్, తాగునీరు, ర్యాంప్, మౌలిక వసతుల కల్పన కోసం సిబ్బందికి పలు సూచనలు చేశారు. మిగిలిన ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదికను రూపొందించారు. తహసీల్దారు వెంట స్థానిక వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి

పెదనందిపాడు: బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారిని పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా విద్యా శాఖ అధికారి శైలజ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం సాయంత్రం పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో శైలజ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాడు-నేడు కింద శాంక్షన్ అయిన నిధులను వాటి కోసమే వినియోగించాలని, నిధులను దుర్వినియోగం చేస్తే వాటికి పాఠశాల ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాల్సి వస్తుందని చెప్పారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



విద్యుత్ స్తంభాల మార్పును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలు గత 30–40 సంవత్సరాల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ వాటిని పరిష్కరిస్తున్నామని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం, విద్యుత్ స్తంభాల మార్పును ఎమ్మెల్యే ఆర్కే విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయకుమార్, డీఈ తులసిరామ్, కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డిలతో కలసి పరిశీలించారు. విస్తరించిన రహదారిలో విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉండడంతో వాటిని వెంటనే తొలగించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ విజయవాడ అతి సమీపంలో ఉండడం, జాతీయ రహదారి పక్కనే ఉండడంతో కుంచనపల్లి త్వరితగతిన అభివృద్ధి చెందుతోందని, కుంచనపల్లి సచివాలయానికి వెళ్లాలంటే చిన్నరహదారి ఉందని, రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉందని ప్రధాన రహదారిని విస్తరించాలని స్థానికులు కోరారని, మొట్టమొదటగా ప్రభుత్వ స్థలాలు ఎక్కడవరకు ఉన్నాయో గుర్తించి, కొన్నిచోట్ల ప్రైవేటు భూములు ఉండడంతో వారితో సంప్రదించి స్థానిక నాయకులతో కలసి వారితో చర్చించి విస్తరణ పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ ప్రత్యేక నిధుల నుంచి రూ.కోటి కేటాయించి 500 మీటర్ల పొడవున సీసీ రోడ్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే ఆర్కేకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, మాజీ వైస్ సర్పంచ్ అమరా నాగయ్య, వైఎస్సార్ సీపీ కుంచనపల్లి అధ్యక్షుడు మిరియాల రాంబాబు, గడ్డం తాతయ్య, ఎస్ఐ సాంబిరెడ్డి, డేవిడ్, తిరుమల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరి సంక్షేమమే ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో కత్తెర సురేష్ కుమార



మందపాడులో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న కత్తెర సురేష్‌కుమార్

మేడికొండూరు: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మేడికొండూరు మండల పరిధిలోని మందపాడు గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రజలకు సంక్షేమం అభివృద్ధిని అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకే కాకుండా అగ్రవర్ణ పేదలకు కూడా సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి ఇంటిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అనేక పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. 14 ఏళ్ల రాష్ట్రాన్ని పరిపాలించిన చంద్రబాబు అనేక కుంభకోణాల్లో ఇరుక్కుని జైళ్ల జీవితం గడుపుతున్నాడన్నారు. ప్రజలు చంద్రబాబుని నమ్ముకుంటే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. గ్రామ సర్పంచి ఆవుల సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖరరెడ్డి, దొడ్డా సాంబిరెడ్డి, వజ్రాల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూనికల మిషన్‌కు సీల్ తప్పనిసరి



వేయింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల అధికారి సునీల్

ఫిరంగిపురం: మండలంలోని అన్ని గ్రామాల రేషన్ డీలర్లు తమ తూనికల మిషన్‌లకు సీల్ తప్పనిసరిగా వేయించుకోవాలని సత్తెనపల్లి తూనికలు, కొలతల అధికారి సునీల్ అన్నారు. మండలంలోని రేపూడి గ్రామ వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం అన్ని గ్రామాల రేషన్ డీలర్లకు సంబంధించిన తూనికల మిషన్‌లను, తూనికల కొలతల అధికారి సునీల్ తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా తూనికల మిషన్‌ల పనితీరు పరిశీలించి హెచ్చుతగ్గులు, కొలతల్లో తేడాలు లేకుండా చూసి వాటికి ప్రభుత్వ సీల్ వేస్తున్నట్లు తెలిపారు. 17 గ్రామాల్లోని 42మంది రేషన్ డీలర్లు ఉండగా 40 తూనికల మిషన్లు వచ్చాయని చెప్పారు. వాటిని ప్రభుత్వ అనుమతించిన స్పీడ్ సిస్టమ్ వారిచే పరిశీలించి చిన్నపాటి రిపేర్లు చేసి వాటికి సీల్ వేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఆథరైజ్డ్ మెకానిక్ ఎస్‌కే ఇబ్రహీం ఉన్నారు.

150 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నిజాంపట్నం: నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని దిండి పంచాయతీ పరిధిలోని అదవల కేసనవారిపాలెం, అడవులదీవి గ్రామాల్లో బుధవారం దాడులు నిర్వహించారు. రెండు గ్రామాలకు వెళ్లే మడ అడవుల్లో 150 లీటర్ల బెల్లం ఊటతో పాటు నాటుసారా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అడవులదీవి గ్రామంలో నాగేశ్వరమ్మ ఇంటి వద్ద మూడు లీటర్ల నాటుసారాను స్వాధీన పరుచుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.